www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 22 ఆగస్టు 2024 | 5 | ఏలూరు



ఏలూరులో వందేభారత్‌కు హాల్ట్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కృషి ఫలితంగా వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఏలూరులో నిలుపుదల చేసేందుకు రైల్వే శాఖ అంగీకరించింది. ఈ మేరకు రైల్వే బోర్డు జాయింట్ డైరెక్టర్ వివేక్‌కుమార్ సిన్హా ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరులో వందే భారత్ రైలు నిలుపుదల కోసం పుట్టా మహేష్ ముందుగా రైల్వే బోర్డు ఛైర్మన్, సిఇఒ జై.వర్మసిన్హా, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవులను కలిసి చర్చలు జరిపారు. ఏలూరు జిల్లా ప్రజల తరపున రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

స్వయం సహాయక సంఘాలకు ఊతం..!

- డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- మండలాల్లో మహిళా మార్టుల ఏర్పాటుకు సన్నాహకాలు
- మహిళలకు ఉపాధి చూపేలా కార్యాచరణ
- 34 వేల డ్వాక్రా సంఘాలకు చేకూరనున్న లబ్ధి

స్వయం సహాయక సంఘాలకు ఊతం కల్పించే విధంగా కూటమి ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోబోతోంది. మహిళలకు ఉపాధి కల్పించే దిశగా ప్రతి మండలంలో మహిళా మార్టుల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో మహిళా మార్టుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా 34 వేల డ్వాక్రా సంఘాలకు లబ్ధి చేకూరనుంది.

ప్రజాశక్తి - భీమవరం

గత వైసిపి ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేసింది. అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టింది. కేవలం సంక్షేమ పథకాలను పుష్కలంగా అందించడమే లక్ష్యంగా పాలన ముందుకు సాగింది. ఈ నేపథ్యంలో ప్రజల ఆర్థిక స్థితిగతులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా మహిళల ఆర్థికాభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలిపోయింది. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు మార్టులపై చర్యలు తీసుకున్నప్పటికీ పూర్తిస్థాయిలో జిల్లా అంతా అమలు జరగలేదు. ఒక్క నర్సాపురంలోనే ఏర్పాటు చేశారు. అక్కడ ప్రతిరోజూ రూ.లక్ష మేర వ్యాపారం సాగింది. దీన్ని జిల్లా అంతా అన్వయించాలని ప్రణాళిక రూపొందించినప్పటికీ మార్టులపై దృష్టి కొరవడింది. దీనికితోడు నరసాపురంలో మార్టులో కూడా రోజుకు సగటున రూ. 40 నుంచి రూ.50 వేల వరకూ అమ్మకాలు పడిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం మహిళా మార్టులు అభివృద్ధి చేసే విధంగా అడుగులు వేస్తోంది. మహిళలు స్వయం ఉపాధి సాధించే దిశగా చర్యలు తీసుకుంటామని, గతంలో కూటమి హామీ ఇచ్చింది. మహిళల ఆదాయం పెంచుతామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి మండలంలోనూ మార్టులు ఏర్పాటు చేసి మహిళలే మార్టులు నిర్వహించేలా చర్యలు తీసుకోనున్నారు. ముఖ్యంగా డ్వాక్రా సంఘాల మహిళలకు అవకాశం కల్పించనున్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 34 వేల సంఘాలు ఉన్నాయి. వారందరికీ ఉపాధి మార్గం చూపేలా ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది. ఏర్పాటు చేసే మార్టుల్లో డ్వాక్రా సభ్యులంతా అక్కడకు వెళ్లి కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. బయట మార్కెట్ కంటే కాస్త తక్కువ ధరకే సరుకులు లభ్యమయ్యే విధంగా చర్యలు తీసుకోమన్నారు. జిల్లాలో 20 మండలాలు ఉన్నాయి. ప్రతి మండల కేంద్రంలోనూ మార్టులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఆ దిశగా స్పష్టమైన



ఆదేశాలు జారీ చేసింది. గతంలో జిల్లాలో నర్సాపురం, పాలకొల్లు, అత్తిలి, పెనుగొండ, తణుకు రూరల్ మండలాల్లో మార్టులు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. నరసాపురంలో మాత్రం మార్ట్ ఏర్పాటు చేశారు. మిగిలిన మండలాల్లో డ్వాక్రా సభ్యుల నుంచి పూర్తిస్థాయిలో సొమ్ములు వసూలు చేయలేకపోయారు. ప్రతి సభ్యురాలి నుంచి రూ.200 వంతున వసూలు చేస్తారు. అంటే ఒక్కో గ్రూపు రూ.2000 చెల్లించాలి. మహిళా పొదుపు నుంచి, లేదంటే రుణాల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయనున్నారు. మార్టుల్లో పెట్టుబడి పెడతారు. వచ్చిన లాభాలను కూడా అదే మార్టులో మళ్లీ పెట్టుబడి చేస్తారు. నిర్వాహకులకు వేతనం ఇస్తారు. దీనివల్ల బయట మార్కెట్ కంటే తక్కువ ధరకే సరుకులు మహిళలకు లభ్యం కానున్నాయి. ప్రతి మార్టులోనూ కనిష్ఠంగా ఆరుగురికి ఉపాధి లభించనుంది.

సొమ్ములు వసూలైన తర్వాతే మార్టుల ఏర్పాటు..

గత వైసిపి ప్రభుత్వ హయాంలో మార్ట్‌ల ఏర్పాటుకు ప్రతి డ్వాక్రా సభ్యురాలి నుంచి రూ.200 చొప్పున వసూలు చేయడం జరిగింది. ఒక గ్రూపు నుంచి రూ.2000 వరకూ వసూలు చేశారు. అయితే మహిళా మార్టుల ఏర్పాటు కాకపోవడంతో గతంలో వసూలు చేసిన సొమ్ముపై అధికారులు ఇప్పటివరకూ చర్యలు తీసుకోలేదు. అయితే సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో మార్టుల వ్యవహారం పక్కకుపోయింది. దీంతో రూ.2 వేలు చెల్లించిన మహిళా గ్రూపులు గుబులు చెందుతున్నాయి. తాము చెల్లించిన సొమ్ముకు భరోసా లేకుండా పోయిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. పూర్తిస్థాయిలో ప్రతి మండలం నుంచి సొమ్ములు వసూలు చేసిన తర్వాత మార్టుల ఏర్పాటు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

మహిళలకు మరింత ఊరట..

మహిళా మార్ట్ కోసం సభ్యులే పెట్టుబడి పెడుతున్నారు. దాంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు కల్పిస్తే మార్టులు బలోపేతంగా ఉంటాయి. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు కల్పిస్తే మహిళలకు మరింత ఊరట లభించే అవకాశం ఉంది. తక్కువ ధరకే నాణ్యమైన ఉత్పత్తుల విక్రయం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దానికితోడు డ్వాక్రా సంఘాలు తయారు చేసే వస్తువులను కూడా మార్టుల్లో అమ్మకానికి పెట్టనున్నారు. తద్వారా డ్వాక్రా సంఘాలకు కూడా ఉపాధి లభించనుంది. ఫలితంగా మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చు. ప్రస్తుతం రుణాలు తీసుకుని అనేకమంది సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఎటువంటి ఉత్పత్తులు తయారు చేయడం లేదు. డ్వాక్రా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులు అమ్మకానికి ఈ మార్టులు ఉపయోగపడతాయి. ఆ దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

జెసి ఆదేశాల ప్రకారం అసైన్డ్‌దారులకు భూములు అప్పగించాలి

దోసపాడు పేదలకు న్యాయం చేయాలి

రెవెన్యూ, పోలీసు అధికారుల తీరు అన్యాయం

వ్యకాస జిల్లా కార్యదర్శి పి.వి.రామకృష్ణ

ప్రజాశక్తి - దెందులూరు



ఆందోళన చేస్తున్న నేతలు, దోసపాడు పేదలు

జెసి కోర్టు ఆదేశాల ప్రకారం అసైన్డ్, సీలింగ్ భూములు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చెరువుల దగ్గరికి వెళ్తున్న దోసపాడు పేదలను పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమని ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.రామకృష్ణ అన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే చట్టవ్యతిరేకంగా భూస్వాములు కొమ్ముకాయడం సిగ్గుచేటన్నారు. బుధవారం దోసపాడు భూపోరాట కమిటీ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దోసపాడు పేదలు, దళితులు చెరువుల దగ్గరికి బయల్దేరారు. అయితే వారిని మార్గమధ్యంలోనే పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై నేతలు, పేదలతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆదేశాలను నేటికీ అమలు చేయకపోవడానికి కారణాలు ఏమిటని ప్రశ్నించారు. పేదలకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్భంలో రెవెన్యూ శాఖాధికారులు పట్టించుకోకపోవడం లేదని విమర్శించారు. భూస్వాములతో అధికారులు కుమ్మక్కై, వారికి కొమ్ముకాస్తున్నారని మండిపడ్డారు. అసైన్డ్ చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. మాటలు మార్చి అధికారులు మారుతున్న ప్రతిసారి మా దృష్టికి తీసుకురాలేదని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఒకసారి ఇచ్చిన ఆదేశాలు ఆఫీసు రికార్డుల నుంచి మాయమైపోతున్నాయా లేక మారిపోతున్నాయా అని నిలదీశారు. జాయింట్ కలెక్టర్ తీర్పును అమలు చేయకపోతే ఇక రెవెన్యూ అధికారులు ఏం చేస్తారని, ఎవరి ఆదేశాలను పాటిస్తారని ప్రశ్నించారు. పేదల పక్షాన పోరాడుతున్న వారిపై అక్రమ కేసులు పెట్టి పేదలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. స్థానిక విఆర్‌ఒ భూములపై పర్యవేక్షణ లేకపోవడం, రికార్డులు తారుమారవుతున్నా జిల్లా అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరువుల దగ్గరికి వెళ్తున్న సందర్భంలో పోలీసులు అడ్డుకుని కేసులు పెట్టడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. భూస్వాములు పేద చెరువులో చేపలు పడుతున్నా వారిపై నేటికీ ఒక్క కేసు లేకపోవడం బట్టి భూస్వాములు ఇచ్చే లంచాలకు రెవెన్యూ, పోలీస్ అధికారులు లొంగిపోయారని అర్థమవుతుందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్‌లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో భూములు పేదలకివ్వాల చర్యలు చేపట్టాలని కోరారు. దోసపాడు, కొవ్వలి, పోతునూరు, దెందులూరులో ఉన్న అసైన్డ్, సీలింగ్, గయ్యాల భూములపై సర్వే నిర్వహించాలని, భూమి లేని పేదలకు భూములు పంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని, రాబోయే కాలంలో జరిగే పరిణామాలకు రెవెన్యూ అధికారులే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

పివిటిజిల సమీకృత అభివృద్ధే ధ్యేయం : కలెక్టర్ వెట్రిసెల్వి



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని పివిటిజి ఆవాసాల్లోని అర్హులైన వారందరికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల ద్వారా లబ్ధి కల్గించేందుకు మిషన్ మోడ్‌లో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. పిఎం జన్‌మన్ పథకం అమలుపై బుధవారం రాష్ట్ర ఉన్నతాధికారులు, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం పిఎం జన్ మన్ యోజన అనుసంధానమైన వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా పక్కాఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణ, నిరంతర నీటి సౌకర్యం, ప్రతి ఇంటికీ విద్యుత్, సోలార్, మొబైల్ టవర్లు తదితర ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పివిటిజి (పర్టిక్యులర్లి వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్) కింద బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు మండలాల్లో గిరిజనులకు ఆయా పథకాలు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు విద్యా, ఆరోగ్యం తదితర సర్వీసులను సంతృప్తికరస్థాయిలో అందించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్య, ఆరోగ్యం, గృహకల్పన నూరుశాతం కల్పించే లక్ష్యంతో పని చేయాలని సూచించారు. కుటుంబం యూనిట్‌గా ప్రణాళిక అమలు చేయాలన్నారు. జిల్లాలో 86 పివిటిజి నివాసిత ప్రాంతాల్లో 9347 మంది పివిటిజి జనాభా కలిగి ఉన్నారని, వారిలో ఇంతవరకు 5320 మందికి సికిల్‌సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పూర్తయిందన్నారు. మిగిలినవారు కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అర్హులైన వారందరికీ ఆయుష్మాన్ భారత్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ సత్యనారాయణ, డిఎంహెచ్ఒ ఎస్.శర్మిష్ఠ, ట్రైబల్ వెల్ఫేర్ డిడి పివిఎస్.నాయుడు, గిరిజన ఇంజినీరింగ్ శాఖ ఇఇ కెవిఎస్ఎన్.కుమార్, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, ఐసిడిఎస్ పీడీ కె.పద్మావతి, ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలి

నిందితులను కఠినంగా శిక్షించాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన



ఏలూరులో మహిళా సంఘాల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొలకత్తాలో హత్యాచారానికి గురైన వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళ రక్షణకు కఠిన చట్టాలు తీసుకురావాలని తదితర డిమాండ్స్‌తో ఈ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కొర్రి విజయలక్ష్మి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు, అత్యాచారాలపై కఠిన చట్టాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య, టిపిఆర్.దొర, హైమావతి, రజిని, లోకేశ్వరి, అరుణకుమారి, జాన్‌బాబు, ఆంతోనమ్మ, సుకన్య, ఇందిర, గీత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా సంఘాలు స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశాయి. తొలుత స్థానిక జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి నుంచి మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు కళ్లకు గంతలు కట్టుకుని ఫైర్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.శ్యామలారాణి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని నిందితులను కఠినంగా శిక్షించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఈ ధర్నాలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, సభ్యులు పుప్పాల మంగ, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, వైజ్ ఏలూరు ఆర్గనైజేషన్ డైరెక్టర్ ఎన్.లక్ష్మీకుమారి, జనసేన పార్టీ ఉభయ గోదావరి జిల్లా కార్యదర్శి కె.సాయితేజశ్వి, ప్రభ అభ్యుదయ సేవా సమితి కార్యదర్శి కె.ప్రభ పాల్గొన్నారు.

శ్రీ పాద శ్రీ వల్లభ కూచిపూడి నాట్యనిలయం వారు దొండపాడు నుంచి ఫైర్‌స్టేషన్ వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా డ్యాన్స్ టీచర్ మేదరమెట్ల శిరీష మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్నేహ, గాయత్రి, హిమజ, గాయత్రి, రుత్విక, శ్రీ అక్షర, జ్యోతి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : కొల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల మహిళా సంఘం (పిఒడబ్ల్యు) ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) సంఘాల ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బస్టాప్ సెంటర్‌లో నిర్వహించిన సభలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు భారతి, డివిజన్ అధ్యక్షురాలు కారం లక్ష్మి, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకులు తగరం బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, వేధింపులు, హత్యలు పెరిగాయన్నారు. ఇందుకు ప్రధాన కారణం సామ్రాజ్యవాద విష సంస్కృతి, దేశంలో మద్యం విచ్చలవిడిగా అమ్మడం, మహిళను చిన్న చూపు చూసే మనువాదపు సిద్ధాంతాన్ని ప్రోత్సహించడం వంటి విధానాలు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యాచారాలు అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నాయని విమర్శించారు. ఈ నిరసనలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వెట్టి సుబ్బన్న, కారం రాఘవ, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు కెవి.రమణ, ఎస్.రామ్మోహన్, పి.నాగేశ్వరరావు, ధర్ముల లక్ష్మి, సరియం అనిత, పూనేం రాముడు పాల్గొన్నారు.

నిడమర్రు : నిడమర్రులో సిఐటియు స్కీమ్ వర్కర్స్, మహిళలు నినాదాలు చేస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. నిడమర్రు జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు, నిమ్మల పార్వతి, దేవుని విజయలక్ష్మి, టి.వెంకటలక్ష్మి, నాగమణి, ఈశ్వరి, రాజ్యలక్ష్మి, సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. శ్రీనివాసరావు, వెలగలేటి మోహన పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు కళ్లకు గంతలు కట్టి ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు మండలాధ్యక్షురాలు సువ్వేటి లత అధ్యక్షతన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మడివి దుర్గారావు మాట్లాడారు. సిపిఎం మండల కార్యదర్శి ధర్ముల రమేష్, సిఐటియు మండల కార్యదర్శి బోగారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.రాజు, హనుమాన్లు, మహిళా సంఘం నాయకురాలు పద్మాంజలి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : సిఐటియు ఆధ్వర్యంలో రామారావుపేట సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఐటియు నాయకులు తెల్లం రామలక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి, పార్వతి, వాణి, బేబి, సుదీప్న ,నిర్మల పాల్గొన్నారు.

నేడు నిరసన ర్యాలీ

దెందులూరు : కొల్‌కత్తాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారంపై నిరసనగా, నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ గురువారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సెయింట్ జోసెఫ్, సెయింట్ థెరెసా విద్యాసంస్థల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నారు. సెయింట్ థెరిసా డిగ్రీ కళాశాల నుంచి ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సెయింట్ జోసెఫ్ దంత కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఫాదర్ జి.మోజెస్, సెయింట్ థెరిసా డిగ్రీ కళాశాల యాజమాన్యం రెవరెండ్ సిస్టర్ డాక్టర్ మెర్సి తెలిపారు.

భారత్ బంద్ విజయవంతం



ఏలూరులో....

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా బుధవారం దేశవ్యాప్తంగా చేపట్టిన బంద్ ఏలూరులో పాక్షికంగా జరిగింది. దళిత బహుజన జెఎసి ఆధ్వర్యంలో ఏలూరు కొత్త బస్టాండ్ గ్యారేజ్ వద్ద ధర్నా నిర్వహించి బస్సులు నిలిపివేశారు. కొద్దిసేపటి తర్వాత పోలీసులు ఆందోళన చేస్తున్నవారిని అక్కడి నుంచి పంపించి వేయడంతో తర్వాత బస్సులు యథావిధిగా తిరిగాయి. నగరంలోని పాఠశాలలు మూతపడ్డాయి. బంద్ నిర్వాహకులు దుకాణాలను మూయించివేశారు. మధ్యాహ్నం నుంచి కొన్ని దుకాణాలు తెరుచుకున్నాయి. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మెండెం సంతోష్ కుమార్, నేతల రమేష్ బాబు, దాసరి రమేష్, అలగ రవి, ఎరికిపాటి విజయ్, కొయ్యగర్ల శ్యామ్ పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని ప్రయివేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు భారత్‌బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించారు. దీంతో మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. జెఎసి నాయకులు వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు, జై భీమ్ జై భీమ్ అంటూ నినాదాలు చేశారు.

జీలుగుమిల్లి : మండలంలో బంద్‌లో మాల మహానాడు, దళిత, బహుజన సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మండలంలోని కిరాణా షాపులు, ప్రయివేట్ పాఠశాలలు, బ్యాంకులను, ప్రయివేట్ వ్యాపార సంస్థలను మూయించివేశారు. అనంతరం దళిత సంఘాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై కొంతసేపు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సంఘాల నాయకులు జాన్‌మోషే, శ్రీను, రామారావు, సతీష్, రాఘవులు, అరుణ్ పాల్గొన్నారు.

చాట్రాయి : మండలంలో బంద్ ప్రశాంతంగా జరిగింది. నీలిరంగు టీ షర్టు, కండువా ధరించి జై భీమ్, ఎస్‌సి వర్గీకరణ నిలిపివేయాలంటూ నినాదాలు చేశారు. మాల మహానాడు మండల నాయకుడు రాజు మాట్లాడారు. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలు, వ్యాపారులు, బ్యాంకులు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. ఈ కార్యక్రమంలో నక్క రాము, బుర్రి రమేష్, గంధం రాజేష్, సుందరరావు, రవి పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : అంబేద్కర్ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ వాసులు బుట్టాయగూడెంలో భారత్ బంద్‌ను నిర్వహించారు. ఈ బంద్‌కు మద్దతుగా వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులను మూసివేశారు. ఈ కార్యక్రమంలో మాలలు కోరం దుర్గారావు, కట్టా మధుసుందర్‌బాబు, గంజి మధుబాబు, కనికెళ్ల ప్రవీణ్‌కుమార్, కనికెళ్ల శ్రీను, చల్లపల్లి ప్రతాప్, దారా శిఖమణి, అందుగుల నానాజీరావు పాల్గొన్నారు.

ముసునూరు : మండలంలోని 16 గ్రామాల్లో మాల మహానాడు నాయకులు బంద్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల వాణి, రామరాజు, ప్రకాష్, అశోక్, రవి, శాంతారావు, కాంతారావు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : నూజివీడులో ఆర్‌టిసి, స్కూల్, కళాశాలల బస్సులను ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు నిలిపివేసి బంద్ చేశారు. దళిత సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొన్నారు.

మండవల్లి : మండవల్లి ప్రధాన సెంటర్‌లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు చాబత్తిన విజయ్ మాట్లాడారు. అనంతరం వర్గీకరణ వద్దు ఐకమత్యమే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ బంద్‌లో సర్పంచి మెండ ఝాన్సీ, ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు పాల్గొన్నారు.

కుక్కునూరు : కుక్కునూరు ప్రధాన రహదారి వద్ద వర్గీకరణ వద్దు కలిసి ఉంటే ముద్దు, మాలల ఐక్యత వర్ధిల్లాలి అంటూ పలు నినాదాలతో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బొంతు వెంకటేశ్వర్లు, కూరాకుల బాబూరావు, చుంచుపల్లి నాగరాజు, కాకర్ల రమణయ్య పాల్గొన్నారు.

పోలవరం : వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు మూతపడ్డాయి. తహశీల్దార్, ఎంపిడిఒ, పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాలను మూయించివేశారు. దుకాణాలన్నీ మూతపడ్డాయి. రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. మధ్యాహ్నం వరకు ఆర్‌టిసి బస్సులు తిరగలేదు. హోటళ్లు సైతం మూసివేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలవరం సిఐ జి.మధుబాబు, ఎస్ఐ ఎస్.పవన్‌కుమార్ తమ సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు, సభ్యులు ర్యాలీగా కొత్తపైడిపాక వెళ్లి అక్కడ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిదిండి : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలు, బ్యాంకులు, పలు ప్రభుత్వ కార్యాలయాలు మూతబడ్డాయి. జెఎసి ఎస్‌సి సెల్ నాయకులు కురేళ్ల ఏడుకొండలు, మాలమహానాడు జిల్లా అధ్యక్షులు బళ్ల రాజు, ఎస్‌సి సెల్ నాయకులు ఈదా పద్మారావు, మద్దిరాల జోగిబాబు ప్రధాన సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలిపారు.

ద్వారకాతిరుమల : మాలల ఐక్యత ఆధ్వర్యంలో ద్వారకా తిరుమలలో అంబేద్కర్ విగ్రహానికి పాలభిషేకం చేసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ర్యాలీ నిర్వహించారు.

ముదినేపల్లి : దళిత సంఘ నేతల పిలుపుమేరకు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు, కిరాణా వర్తక సంఘ వ్యాపారులు స్వచ్ఛందంగా షాపులు మూసివేశారు. ఉదయం నుంచి ఆర్‌టిసి బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చింది. బంద్ కారణంగా ముదినేపల్లి బస్ స్టేషన్ ప్రయాణికులు లేక వెలవెలపోయింది. ఈ కార్యక్రమంలో దళిత నేతలు భూపతి రవీంద్ర, పాగోలు విజయసాగర్, ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉంగుటూరు : మండలంలోని నారాయణపురంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలను మూయించామని ఎస్‌సి నాయకుడు దిడ్ల శ్రీనివాస్ వెల్లడించారు. ఆయనతో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బంద్‌లో వాగ్వివాదం

యువకునిపై కత్తితో దాడి

ప్రజాశక్తి - టి.నరసాపురం



పవన్‌ను పరామర్శిస్తున్న డిఎస్‌పి

మండలంలోని బంధంచర్ల గ్రామంలో హింసాత్మక సంఘటన చోటు చేసుకుంది. బంద్‌కు సహకరించాలని కోరిన యువకునిపై హోటల్ యజమాని ఉల్లిపాయలు కోసే కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యువకుడు మారుమూడి పవన్‌ను బంధువులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బంధంచర్లలో భారత్ బంద్ నేపథ్యంలో దళిత సంఘాల నాయకులు షాపులు, హోటళ్లు మూయిస్తున్న క్రమంలో గ్రామానికి చెందిన మారుమూడి పవన్ గ్రామంలో టీ హోటల్ నడుపుతున్న యజమాని జాలాది దివాకర్‌ను తెరిచి ఉన్న హోటల్‌ను మూయాలని కోరడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో దివాకర్ ఉల్లిపాయలు కోసే కత్తితో పవన్‌పై దాడి చేసి పొట్టపై పొడవడంతో గాయాలపాలైన పవన్‌ను స్థానికులు 108లో చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హోటల్ యజమానిని కాపాడి కేసును నీరు కార్చేందుకు కొంతమంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నట్లు దళిత సంఘాలు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత సంఘాలు, దళిత ఐక్యవేదిక నాయకులు కాకర్ల సత్యం, దార వీరేంద్ర, నత్త వెంకటేశ్వరావు, నత్త రవికుమార్, గొంది రాజు పలువురు చింతలపూడిలో ధర్నా చేపట్టారు. పవన్‌పై కత్తితో దాడి చేసిన దివాకర్‌ను తక్షణమే అరెస్ట్ చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పవన్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ దాడి చేసిన వ్యక్తిని చట్ట ప్రకారం అరెస్ట్ చేసి, అతని పై చట్టపరంగా చర్యలు చేపడతామని తెలిపారు.

ఏలూరు అర్బన్ : టి.నర్సాపురం మండలం బంధంచర్ల గ్రామంలో యువకునిపై హోటల్ యజమాని కత్తితో దాడి చేసి గాయపరచడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రకటన విడుదల చేశారు. సమస్యలపై ఎవరికి వారు తమ డిమాండ్లపై ఉద్యమాలు చేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ప్రజాస్వామ్యుతంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సహకరించడం లేదా సహకరించకపోవడం వారి వారి ఇష్టమని అయితే ఆందోళనకారులపై కత్తులతో దాడులు చేయడం తగదని ఆయన పేర్కొన్నారు. కత్తితో దాడి చేసిన వారిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

నాటి ప్రాచీన కళా వైభవాన్ని పరిరక్షిస్తాం

ఎంఎల్‌ఎ బడేటి చంటి

ఏలూరు సిటీ : ఏలూరు ప్రాచీన కళా వైభవాన్ని చారిత్రిక ఆధారాలతో నిక్షిప్తం చేసి, వాటిని నేటి తరానికి అందించే గురుతర బాధ్యతను స్వీకరించామని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి కోరారు. ఏలూరు అగ్రహారంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా పురావస్తు ప్రదర్శనశాలను ఆయన బుధవారం సందర్శించారు. అక్కడ ప్రదర్శనకు ఉంచిన శిలావైభవాన్ని, కళాత్మక శిల్పాలను తిలకించారు. చారిత్రక ఆధారాలతో కూడిన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చంటి మాట్లాడుతూ ఏలూరుకు ఎంతో ప్రాచీన చరిత్ర ఉందని, అటువంటి చరిత్రను చారిత్రక ఆధారాలతో పురావస్తు ప్రదర్శనశాలలో నిక్షిప్తం చేసేలా చర్యలు తీసుకున్నా మన్నారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడం తోపాటు సంబంధిత మంత్రులతో సంప్రదించి, అతి త్వరలోనే మ్యూజియంను ప్రజలకు, విద్యార్థులకు అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో మ్యూజియం ఏర్పాటు కూడా నత్తనడకన సాగడం దారుణమన్నారు. తన హయాంలో నియోజక వర్గానికి రాష్ట్రంలో ప్రత్యేక గుర్తిం పు తీసుకురావడమే తన లక్ష్యమని ఎంఎల్‌ఎ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ తిమ్మరాజు, టెక్నికల్ అసిస్టెంట్ సత్య, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, పురావస్తు శాఖా సిబ్బంది పాల్గొన్నారు.

సొసైటీ డిపాజిట్‌దారులకు న్యాయం చేయాలి

ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు వినతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురంలోని సహకార సంఘంలో డిపాజిట్ దారులకు న్యాయం చేయాలని కోరుతూ టి.నరసాపురం గ్రామానికి చెందిన నాయకులు కస్సం సర్వేశ్వరరావు కోరారు. ఈ మేరకు పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీలో డిపాజిట్ చేసిన వారికి డిపాజిట్ డబ్బులు, వడ్డీ డబ్బులు చెల్లించడం లేదని వివరించారు. బాధితులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

శ్రీవారి ఆదాయం రూ.2,39,96,220

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీలు బుధవారం ఉదయం ప్రమోద మండపంలో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ కార్యనిర్వహణాధికారి పర్యవేక్షణలో లెక్కించారు. ఈ హుండీల ద్వారా స్వామి వారికి గడచిన 27 రోజులకు రూ.2,39,96,220 ఆదాయం వచ్చింది. అలానే యాత్రికుల కానుకల రూపేణ 145 గ్రాముల బంగారం, ఆరు కేజీల 019 గ్రాముల వెండి, పాత రూ.500 నోట్లు నాలుగు, రెండు వేల నోట్లు 48, పలు దేశాల విదేశీ కరెన్సీ సైతం లభించాయి. ఈ హుండీల లెక్కింపులో ఆలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేండ్ర త్రినాథరావు తెలిపారు.

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా సీజనల్ వ్యాధులు రాకుండా మలేరియా విభాగం వారు దోమల నివారణ మందును పిచికారీ చేశారు. 19వ డివిజన్‌లోని ఎన్‌టిఆర్ కాలనీ, ఏటిగట్టు, హనుమాన్ నగర్, తదితర ప్రాంతాల్లో దోమల లార్వా నిర్మూలనకు పిచికారీ, మురుగు కాలువ కల్వర్టు కింద ఫాగింగ్, ఖాళీ స్థలాల్లో ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేసినట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పైడి వెంకట్రావు, శ్రీనివాస్, మలేరియా ఇన్‌స్పెక్టర్ దత్తి వేణుగోపాలస్వామి, శానిటరి ఇన్‌స్పెక్టర్ వి.బాలస్వామి, ఆరోగ్య కార్యదర్శి, ఆశా కార్యకర్తలు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

నూజివీడులో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పద్మభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి యువత ఉమ్మడి కృష్ణాజిల్లా జాయింట్ సెక్రటరీ సత్తెపు సుధీర్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. నూజివీడు పట్టణంలోని రాజీవ్ సర్కిల్ వద్ద ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో ఏలూరు రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నూజివీడు ప్రముఖులు లయన్ కృష్ణప్రసాద్, మెగా సీనియర్ అభిమాని కప్పూరి రాము ప్రారంభించారు. మెగా బ్లడ్ క్యాంపులో మెగా అభిమానులు, జనసైనికులు, సామాజికవేత్తలు, పలు శాఖల అధికారులు, పాత్రికేయులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెగా అభిమానులు, జనసేన నాయకులు బొబ్బిలి శ్రీకాంత్, తోట వెంకట్రావు, దిలీప్, పాశం నాగబాబు, సూరిశెట్టి శివ, ఏనుగుల వర్మ, షేక్ ఇమ్రాన్, బజారు దుర్గాప్రసాద్, నెల్ల ఉమామహేశ్వరి, పవన్, రాజేష్, తెలుగు మహిళ నాయకులు రాధ, జ్యోతి పాల్గొన్నారు.

యువకులపై కేసులను కొట్టివేయాలి : మాజీ ఎంపీ

ప్రజాశక్తి - చింతలపూడి

పోలీస్ స్టేషన్‌లో 25 మంది దళిత యువకులపై పెట్టిన కేసును వెంటనే కొట్టి వేయాలని మాజీ ఎంపీ హర్షకుమార్ డిమాండ్ చేసారు. టి.నర్సాపురం బంధంచర్లలో జరిగిన సంఘటనలో బాధితుడు పవన్‌ను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బంద్ విజయవంతంగా జరిగిందన్నారు. పోలీసులు యువకులపై పెట్టిన కేసును కొట్టివేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే చలో టి.నర్సాపురం పిలుపునిస్తామని చెప్పారు. పవన్‌పై దాడి చేసిన నిందితులను అరెస్టు చేయాలన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ

ప్రజాశక్తి - పెదపాడు

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద మండలంలోని రాజుపేట గ్రామంలో బుధవారం పశువుల్లో గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ కార్యక్రమాన్ని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక పశు సంవర్ధక శాఖాధికారులు, సిబ్బంది ఎంఎల్‌ఎ ప్రభాకర్‌కు జ్ఞాపిక అందించి సత్కరించారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

మధ్యాహ్నం భోజన పథకంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్రీయ బాలల సంక్షేమ కిశోర బాలికల సంయుక్త ఏలూరు జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. బాలికల వసతి గృహాన్ని సందర్శించారు.

ముగిసిన శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు పంచాయతీ పాలనపై నిర్వహించిన శిక్షణా తరగతుల్లో నేర్చుకున్న అంశాలను అమలు చేసి తమ గ్రామ పంచాయతీలను ఉత్తమ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దుకోవాలని ఎంపిడిఒ పద్మావతి దేవి కోరారు. వారికి గత మూడు రోజులుగా భీమడోలు కేంద్రంగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. కార్యక్రమంలో భాగంగా కోర్సు సహాయ డైరెక్టర్లుగా సూరప్పగూడెం గ్రామపంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, అంబర్‌పేట గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం.వెంకట్రావు పనిచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి విస్తరణాధికారి ఎ.సుందరి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుల ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ట్రిపుల్ ఐటీ అధ్యాపక సిబ్బంది నివాసాల్లో మంగళవారం రాత్రి దొంగలు పడ్డారు. వన్‌బ్లాక్‌లోని 203, 401 ఫ్లాట్లలో దొంగలు పడి రూ.1.95 లక్షల నగదు, 15 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించుకుపోయారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ ఏర్పడి 15 సంవత్సరాలలో తొలిసారి దొంగలు పడ్డారు. ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీం అగంతకుల వేలిముద్రలను సేకరించే నిమగ్నమయ్యారు. నూజివీడు పట్టణ ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కోళ్ల వ్యర్థాలు పట్టివేత

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు సమీపంలోని పెదలింగంపాడు వద్ద చేపల మేతగా తెచ్చిన కోళ్ల వ్యర్థాలను దిగుమతి చేస్తుండగా రెవెన్యూ, పోలీస్, మత్స్యశాఖలకు చెందిన అధికారులు సభ్యులుగా గల మండల ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ దాడి చేసి పట్టుకున్నట్లు మండల మేజిస్ట్రేట్ బి.రమాదేవి తెలిపారు. లింగంపాడు వద్ద 120 ఎకరాల విస్తీర్ణం గల చేపల చెరువును ఘంటా మోహన్‌రావు అనే వ్యక్తి లీజుకు తీసుకొని సాగు చేస్తున్నారు. బుధవారం ఉదయం సుమారు నాలుగు టన్నుల కోళ్ల వ్యర్థాలు చేపల మేతగా ఆటోలో తెచ్చి దిగుమతి చేస్తున్నట్టు మండల ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి సమాచారం అందింది. దీంతో వారు చేసిన దాడుల్లో పట్టుబడిన కోళ్ల వ్యర్థాలను శ్మశానవాటికలో పూడ్చి వేశారు. రవాణాకు తెచ్చిన వాహనాన్ని సీజ్ చేశారు. బాధ్యులపై కేసును నమోదు చేశారు. అనంతరం భీమడోలు సిఐ బిబి.రవికుమార్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోళ్ల వ్యర్థాలు చేపల మేతగా వినియోగించడం చట్టరీత్యా నేరమన్నారు. గతంతో పోలిస్తే ఈ విషయమై కొన్ని నూతన అంశాలపై కేసులు నమోదవుతున్నాయన్నారు. కోళ్ల వ్యర్థాలను స్వాధీనం చేసుకోవడం, రవాణా వాహనాన్ని సీజ్ చేయటం, తరలిస్తున్న వారిపై కేసును నమోదు చేయడానికి అదనంగా వాటిని చేపల మేతగా వినియోగిస్తున్న రైతులపై సైతం కేసుల నమోదు చేస్తున్నట్టు తెలిపారు. గత 15 రోజుల కాలంలో కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్న ఆరు వాహనాలను సీజ్ చేసి బాధ్యులపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలి

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రైతులకు వెంటనే అందించాలని, తెలంగాణ తరహాలో రాష్ట్రంలోని రైతులకు రుణమాఫీ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మాగ్రాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ద్వారకాతిరుమలలోని యుటిఎఫ్ భవనంలో బుధవారం నిర్వహించిన రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సాగుకు పెట్టుబడికి సొమ్ములు లేక అన్నదాతలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇచ్చిన హామీ ప్రకారం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని కోరారు. అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి అందుకు తగిన నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణ తరహాలో రాష్ట్రంలో రైతుల రుణమాఫీ చేయాలని కోరారు. గతంలో చంద్రబాబు అమలు చేసిన రుణమాఫీ పథకం పూర్తిగా అమలు కాలేదని, ఆ సందర్భంగా ఇవ్వాల్సిన 4, 5 విడతల రుణమాఫీ బకాయిలు రైతులకు చెల్లించాలన్నారు. సెప్టెంబర్ ఒకటి నుంచి జరిగే రెవెన్యూ సదస్సుల్లో రైతుల భూ సమస్యలు పరిష్కరించాలన్నారు. సమగ్ర భూ సర్వే సందర్భంగా వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సాగునీటి ప్రాజెక్టు నిర్లక్ష్యం ఫలితంగా రాష్ట్రంలో రైతులు సాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఆయిల్‌పామ్ కు గిట్టుబాటు ధర కల్పించాలి

కేంద్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆయిల్ పామ్ గెలలకు కనీస ధరలు రాక రైతుల నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. క్రూడ్ పామాయిల్‌పై దిగుమతి సుంకాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసిన ఫలితంగా రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. టన్ను ఆయిల్ పామ్ గెలలకు కనీస ధర రూ.18 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు పాల్గొన్నారు.

కుక్కునూరు సిఐగా రమేష్‌బాబు

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు సిఐగా రమేష్‌బాబు బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను జనసేన నాయకులు కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

జ్వరాల పట్ల క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బట్టువారిగూడెంలో హెల్త్ క్యాంపు ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో కలుపును నివారిస్తే అధిక దిగుబడులు

ప్రజాశక్తి - మండవల్లి

వరి పంటలో కలుపును నివారించుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఎస్‌కె.హబీబ్ బాష చెప్పారు. మండలంలోని లింగాల, పెరిగేగూడెం, కొర్లపాడు గ్రామాల్లోని పొలాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం ద్రువ జీవామృతం తయారీ విధానాన్ని ఉపయోగాలను వివరించారు. పొలంబడి ప్రాముఖ్యతను ఎడిఎ వెంకటమణి వివరించారు.

'ఆదివాసీలకు అందని ఐటిడిఎ సేవలు'

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

కెఆర్.పురం ఐటిడిఎ సేవలు ఆదివాసీలకు అందడంలేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కార్యదర్శి వూయిక ముత్యాలరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటిడిఎ పరిధిలో ఆదివాసీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ఆదివాసీ చట్టాలు కాపాడాలని, ఏజెన్సీలో అన్ని ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు తెల్లం బాలకృష్ణ, పురెం లక్ష్మణ్ పాల్గొన్నారు.

చేపలకు మేతగా కోడి వ్యర్థాలు వేస్తే చర్యలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

చేపల చెరువు కోసం నిషేధిత కోడి వ్యర్థాలను రవాణా చేసినా, మేతగా వినియోగించినా సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఉంగుటూరు తహశీల్దార్ సతీష్ అన్నారు. ఈ మేరకు పోలీసు, విఆర్ఒ, ఫిషరీస్ శాఖ ఉద్యోగితో గ్రామాల వారీగా టాస్క్‌ఫోర్సు కమిటీలను నియమించామని చెప్పారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని డిప్యూటీ సిఎం కొణిదెల పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారని ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ తెలిపారు. పవన్‌కళ్యాణ్‌ను మంగళగిరిలో సొంగా రోషన్‌కుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చింతలపూడి నియోజకవర్గంలో సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 24న జరుగనున్న నామవరం రోడ్ శంకుస్థాపన కార్యక్రమానికి ఆహ్వానించారు. అనంతరం నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పవన్ హామీ ఇచ్చారని తెలిపారు.

24న విజయవాడలో ధర్నా : ఐలు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజాస్వామ్య హక్కులను హరించే నూతన క్రిమినల్ చట్టాల అమలు నిలిపివేయాలని ఐలు జిల్లా కార్యదర్శి మునిస్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు న్యాయవాద సంఘాలు నిర్ణయం మేరకు 24న విజయవాడ ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐలు ఏలూరు నగర కమిటీ సమావేశం అధ్యక్షులు పి.వెంకట్ అధ్యక్షతన జిల్లా కోర్టు ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24న ధర్నాలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో నగర కమిటీ కార్యదర్శి గెద్దా విజయ్ భాస్కర్, ఓరుగంటి శైలజ పాల్గొన్నారు.

ఎసిఎఫ్ఐ జిల్లా డైరెక్టర్‌గా సత్యనారాయణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

యాంటీ కరప్షన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జిల్లా డైరెక్టర్‌గా మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన పొట్లూరి సత్యనారాయణ నియమితులయ్యారు. జిల్లాలో అవినీతి లేకుండా చేయడమే తమ సంస్థ పోరాటమని యాంటీ కరప్షన్ ఫౌండేషన్ రాష్ట్ర ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరరావు తెలిపారు. జిల్లాలో మండలాల వారీగా మెంబర్‌షిప్ కోసం తమను 9391812051 సంప్రదించాలని తెలిపారు.

'మానస' విద్యార్థులు, సిబ్బంది దృక్పథం

విద్యార్థిని చికిత్సకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - భీమడోలు



పత్రాలు విద్యార్థిని కుటుంబ సభ్యులకు అందిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

విద్యలో రాణించడంతో పాటు, సేవా కార్యక్రమాల్లో సైతం తాము ఎవరికీ తక్కువ కాదని భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు, సిబ్బంది తమ చర్యల ద్వారా తెలియజేయటం అభినందనీయమని పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్ర కుమార్ అన్నారు. భీమడోలు సమీప గ్రామానికి చెందిన విద్యార్థిని మామిడి జ్ఞానేశ్వరి ఏలూరులో చదువుతూ ఇటీవల కాలంలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. వైద్యులు జ్ఞానేశ్వరికి లివర్ మార్పిడి చేయాల్సి ఉంటుందని, దీనికి పెద్ద మొత్తంలో ఖర్చవుతుందని తెలిపారు. చికిత్స చేయించేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులు దాతల సహకారం కోరారు. ప్రస్తుతం జ్ఞానేశ్వరికి చికిత్స కొనసాగుతోంది. ఈ విషయం తెలుసుకున్న పాఠశాల కరస్పాండెంట్ జ్ఞానేశ్వరి అవసరాల గురించి విద్యార్థుల కుటుంబ సభ్యులకు, సిబ్బందికి, ఉపాధ్యాయులకు తెలిపారు. దీనిపై స్పందించిన వారు స్వచ్ఛందంగా రూ.2,26,050 విరాళాన్ని సేకరించారు. పాఠశాల యాజమాన్యానికి అందించారు. ఈ మేరకు సేకరించిన విరాళాన్ని జ్ఞానేశ్వరి చికిత్స పొందుతున్న వైద్యశాలకు బదిలీ చేసి సదరు పత్రాలను బుధవారం జ్ఞానేశ్వరి కుటుంబ సభ్యులకు అందించారు. మానస విద్యార్థుల వితరణను పలువురు అభినందించారు.

వృద్ధులను గౌరవించాలి

ప్రజాశక్తి - ముసునూరు

చిన్న చిన్న పలకరింపులు కోరుకునే వయస్సు వృద్ధాప్యమని ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ సిస్టర్ సుధారాణి అన్నారు. జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులను సమావేశపరచి వారి జీవిత అనుభవాలను పంచుకోవడానికి ఒక వేదికను ఏర్పాటు చేసి వారికి తోడుగా మేమున్నామంటూ హామీ ఇచ్చారు. మండల కేంద్రమైన ముసునూరు గ్రామంలో ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ సిస్టర్ సుధారాణి వారిని మూడు గ్రూపులుగా విభజించి ఒకరితో ఒకరు తమ బాధలను, సంతోషాలను పంచుకోవడానికి కొంత సమయాన్ని కేటాయించారు. ఆ సందర్భంలో కొంతమంది ఆనందభాష్పాలు రాల్చగా, మరి కొంతమంది ఇప్పుడున్న తరాన్ని చూడటం ఒక ఆశ్చర్యకరంగా మారిందని మాట్లాడారు. వారందరూ తమ మనోభావాలను వ్యక్త పరచుకోవడానికి ఏర్పాటు చేసినందుకు చాలా సంతోషించి ప్రేరణాలయ సోషల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రాచూరువాలు కోడు మురుగు బోదెను పునరుద్ధరించాలి

రైతుల ఫిర్యాదుపై ఎంఎల్‌ఎ సూచనలతో అధికారుల సర్వే

ఉంగుటూరు : రాచూరు, సీతారామపురం గ్రామాలకు చెందిన 333 ఎకరాల్లో చేపల చెరువుల్లో మురుగు, వరదనీటిని పందికోడు మేజర్ మురుగు కాలువలోకి తీసుకెళ్లే వాలుకోడు బోదెను పునరుద్ధరించా లని ఆయకట్టు రైతులు ఎంఎల్‌ఎ ధర్మరాజును ఇటీవల వరదల సమయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. దీంతో సర్వే చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డ్రెయినేజీ శాఖాధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో సర్వే చేసి వాలు కోడు బోదె బౌండరీస్ గుర్తించాలని రెవెన్యూ అధికారులకు మురుగునీటి శాఖ ఎఇ ఎవి.సత్యనారాయణ లేఖ రాశారు. ఈ నేపథ్యంలో తహశీల్దార్ పొట్టూరి సతీష్, ఆర్అండ్‌బి ఎఇ పొన్నాడ భాస్కరరావు, మండల సర్వేయర్ పి.శ్రీనివాసరావు, డ్రెయిన్స్ ఎఇ ఎవి.సత్యనారాయణ, విఆర్ఒ కుచ్చు వెంకటేశ్వరరావు, గ్రామ సర్వేయర్లు బృందం వాలు కోడును బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ సీతారాంపురం – నిడమర్రు మార్గంలో పందికోడు మురుగు కాలువపై 2019లో పాత ఇరుకు వంతెన పక్కన కొత్తగా బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు నిర్మించే సమయంలో వాలుకోడుకు చెందిన కొంత భూమిని ఆర్అండ్‌బి, నిర్మాణ సంస్థ అధికారులు రోడ్డులో కలిపేసినట్లు తమ రికార్డుల ద్వారా స్పష్టమైందన్నారు. తూర్పు వైపున ఉన్న సుమారు మూడు కిలోమీటర్ల పొడవైన మురుగు బోదె ద్వారా పందికోడులోకి సహజంగా వెళ్లే మార్గం వంతెన, రోడ్డు నిర్మాణంలో కలిసిపోవడంతో ప్రత్యామ్నాయంగా డైవర్షన్ చేసి కొత్తగా నిర్మించిన రోడ్డు కింద నుంచి 60 సెంటీమీటర్ల వెడల్పుతో 200 మీటర్లు పొడవునా సిమెంటు తూరలు పెట్టి తారు రోడ్డు నిర్మించడం వల్లే వరద, మురుగునీరు సక్రమంగా పందికోడులోకి వెళ్లలేకపోవడంతో నష్టపోతున్నామని రైతులు ఫిర్యాదు చేశారన్నారు. దీనికి పరిష్కారంగా రోడ్డుకు పడమర వైపు పెట్రోలు బంకు నిర్మాణం కోసం అన్ని అనుమతులతో ఓ రైతు పొలాన్ని లాండ్ కన్వర్షన్ చేసిన స్థలం అంచు వెంబడి వాలుకోడు మురుగు బోదెను నిర్మించాలని రైతులు కోరుతున్నారు. కాగా గతంలో ఇక్కడి వంతెన నిర్మాణం సమయంలో తమ భూమి కొంత వరకు పోయిందని మళ్లీ బోదె నిర్మాణం తన సొంత స్థలం పక్కనుంచి తవ్వితే మరింత నష్టపోతానని భూ యజమాని అంటున్నారు. ఈ దశలో ప్రభుత్వ రికార్డు ప్రకారంలో సర్వేయర్లు కొలతలు వేసి హద్దులు నిర్ధారించి జెండాలు పాతారు. తదుపరి చర్యల కోసం ఉన్నతాధికారుల దృష్టికి దస్త్రాన్ని పంపుతామని అధికారులు తెలిపారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్ :ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ తలసేమియా కేంద్రంలో బుధవారం 13 మంది తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈరోజు తలసేమియా చిన్నారులకు వారి సహాయకులకు 30 మందికి ఉచిత భోజనాన్ని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు ఇ.పార్థసారథి, ఉషారాణి దంపతులు ఏర్పాటు చేశారని, పండ్లు, ప్రోటీన్ పౌడర్ ఏలూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు స్వామి పంపిణీ చేశారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దెందులూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలోని వసంతవాడ గ్రామంలో బుధవారం మీకోసం–మీ చింతమనేని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన చింతమనేని ప్రభాకర్ దృష్టికి గ్రామస్తులు పలు సమస్యలను తీసుకొచ్చారు. మురుగు నీటి సమస్య వల్ల ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు చెప్పారు. దీంతో స్పందించిన ఎంఎల్‌ఎ చింతమనేని గ్రామంలో 630 మీటర్ల నూతన డ్రెయిన్ మంజూరు చేయటంతో పాటు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. **చింతమనేనిని కలిసిన నాయకులు, అధికారులు, ప్రజలు**

దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్‌ను దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం పలువురు నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల కష్టాలను, సమస్యలను ఆలకించిన ఆయన సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

'సూపర్ సిక్స్‌ని సక్సెస్‌ఫుల్‌గా అమలు చేస్తాం'

పెదపాడు :సూపర్ సిక్స్ పథకాలను సక్సెస్‌ఫుల్‌గా అమలు చేస్తామని దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలోని వసంతవాడ, గోగుంట, రాజుపేట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన మీ కోసం – మీ చింతమనేని కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. వసంతవాడలో డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

సహకార సంఘాల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు సిటీ :సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు టి.వెంకటరామయ్య, కోశాధికారి పి.సత్యనారాయణ, తూర్పుగోదావరి జిల్లా సహకార సంఘం ఉద్యోగులు అధ్యక్షుడు, ఏలూరు జిల్లా యూనియన్ అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ, పశ్చిమ గోదావరి అధ్యక్షులు పి.విజయ్, ఇతర జిల్లా అధ్యక్షులు సుమారుగా 15 మంది అమరావతి సచివాలయంలో రాష్ట్ర సహకార శాఖ మంత్రిని, రాష్ట్ర సహకార కమిషనర్ ఎ.అహ్మద్‌బాబుకు వినతిపత్రం అందించారు. సహకార సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

23న ఉపాధి హామీ గ్రామ సభలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలో ఈ నెల 23న నిర్వహించే ఉపాధి హామీ గ్రామ సభలను ఎంపిడిఒ పారదర్శకంగా తీసుకుని కూలీలందరూ పాల్గొనేలా దండోరా వేయించాలని, గ్రామసభల్లో కూలీలు చేసే పనులు చర్చించి తీర్మానించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల ముఖ్య కార్యకర్తల సమావేశం మండలాధ్యక్షురాలు వై.సీత అధ్యక్షతన స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.జీవరత్నం, మండల కార్యదర్శి ఎ.ప్రభాకరరావు మాట్లాడుతూ 23వ తేదీన నిర్వహించే గ్రామ సభలకు ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఏయే పనులు చేయాలో నిర్ణయించి ఎంపిక చేయాలని పిలుపునిచ్చారు.

జీలుగుమిల్లి : మండలంలోని 12 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేపట్టడానికి ఈ నెల 23న గ్రామ సభ నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి జాన్‌వెస్లి తెలిపారు.

టి.నరసాపురం : మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో గురువారం జాతీయ ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మంగాకుమారి తెలిపారు.